కృష్ణా జలాల పంపిణీ.. వివాదాలు

కృష్ణా జలాల పంపిణీపై మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తమ వాదనలు వినిపించాయి. ట్రిబ్యునల్ తీర్పు ఎప్పుడైనా వెలువడవచ్చు. కృష్ణా మిగులు జలాల అంశమే ఈ రాష్ట్రాల మధ్య ప్రధాన సమస్యగా ఉంది. ట్రిబ్యునల్ తీర్పుపై మన రాష్ట్ర ప్రాజెక్టులు, వ్యవసాయం, నీటి లభ్యత ఆధారపడి ఉన్నాయి.

స్వాతంత్ర్యం అనంతరం భారీ, మధ్యతరహా, చిన్న తరహా ప్రాజెక్టులు అనేకం నిర్మించారు. ఈ నేపథ్యంలో కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీకి సంబంధించి కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా ప్రభుత్వాలు 1960లో వివాదాన్ని లేవదీశాయి. వాస్తవానికి ఈ రెండు నదుల జలాల పంపకానికి సంబంధించి 1951లో ఒక ఒప్పందం కుదిరింది. అది 25 సంవత్సరాలు అమల్లో ఉండాలని నిర్ణయించారు. 1953- 56లలో రాష్ట్రాల పునర్విభజన జరిగి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఏర్పడ్డాయి. దీంతో 1951 ఒప్పందం చెల్లదని కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు వాదించాయి. ఫలితంగా 1962 మేలో కేంద్ర ప్రభుత్వం ఒక సాంకేతిక కమిషన్ (గుల్హాతీ కమిషన్)ను నియమిం చింది. ఈ కమిషన్ 1962 ఆగస్టులో నివేదికను కేంద్రానికి అందజేసింది. ఈ నివేదిక అంచనాలు కచ్చితంగా లేవనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో 1956 నాటి అంత ర్రాష్ట్రీయ నదీ జలాల వివాద చట్టం కింద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. బచావత్ నేతృత్వంలో షంషేర్ బహదూర్, డీఎం భండారీ సభ్యులుగా 1969 ఏప్రిల్ 9న ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. మూడు రాష్ట్రాల వాదనలూ వినడంతో పాటు విస్తృత అధ్యయనం అనంతరం ట్రిబ్యునల్ 1973 డిసెంబర్ 24న కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దానిపై కేంద్రం, రాష్ట్రాలు కొన్ని సందేహాలు వెలిబుచ్చాయి. వాటిని నివృత్తి చేస్తూ 1976 వరకూ అదనపు భాగాలను చేరుస్తూ వచ్చింది. చివరకు ఏడు సంవత్సరాల అనంతరం 1976 మేలో తుది తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 800 (పునరుత్పత్తి ద్వారా 11) టీఎంసీలు కర్ణాటకకు 700 (34) టీఎంసీలు, మహారాష్ట్రకు 560 (25) టీఎంసీలు కేటాయించారు. నదిలో లభించే మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్ వాడుకోడానికి అనుమతించారు. నాగార్జునసాగర్‌పై 45 అడుగుల ఎత్తుగల క్రెస్టు గేట్లను అమర్చి నీటిని వాడుకోడానికి శ్రీశైలం ప్రాజెక్టు, మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా నదిపై జూరాల ప్రాజెక్టు నిర్మాణానికి అవకాశం కల్పించారు. కర్ణాటక, మహారాష్ట్రలు ఘటప్రభ, తుంగభద్ర, వేదవతి సబ్‌బేసిన్లకు, భీమానదిగుండా కాగ్నానది పరీవాహక ప్రాంతంలోని జలాలను వాడుకోడంపై ఆంక్షలు విధించారు. మహారాష్ట్ర అడిగిన ఎగువభద్ర, ఎగువతుంగ, ఎగువ తుంగభద్ర ప్రాజెక్టుల నిర్మాణాన్ని ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. మహారాష్ట్ర తనకు కేటాయించిన నీటిలో కొయినా జలవిద్యుత్ ప్రాజెక్టు నుంచి పశ్చిమంగా అరేబియా సముద్రంలోకి 67.5 టీఎంసీల కన్నా ఎక్కువ మళ్లించరాదని అదేశించింది. తాతా హైడల్ వర్క్స్ నుంచి కృష్ణా జలాలను 54.5 టీఎంసీలకు మించి అరేబియా సముద్రంలోకి వదలరాదని కూడా ఆదేశించింది. 2000 మే 30 తరువాత

మిగులు జలాల పంపిణీకి మరొక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసుకోవచ్చుని ఆ ట్రిబ్యునల్ పేర్కొంది. దీని ప్రకారం 2004 జూన్30న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. ఇది 2006 ఫిబ్రవరి 1 నుంచి పని ప్రారంభించింది. 2010 జనవరి 31 నాటికే నివేదిక ఇవ్వాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల దాన్ని సెప్టెంబర్ 30 వరకూ పొడిగించారు.

బచావత్ అవార్డు ప్రాధాన్యం:

బచావత్ ట్రిబ్యునల్ తీర్పులో కీలకమైన అంశం నీటి లభ్యతను లెక్కగట్టడం. 1962లో ఇరిగేషన్ కమిషన్,

కేటాయించిన నీటిలో మూడేళ్ల పాటు 75శాతమైనా తప్పనిసరిగా నీటి లభ్యత ఉండాలని అప్పుడే ఆ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది. 1963 మార్చి 23న కేంద్ర జలవనరుల మంత్రి లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ 75శాతం నీటి లభ్యత ఆధారంగానే ప్రాజెక్టులు చేపట్టాలని ప్రకటించారు. ఈ రెండు అంశాలనూ దృష్టిలో ఉంచుకొని బచావత్ ట్రిబ్యునల్ కృష్ణానదిలో 75శాతం నీటి లభ్యత ఎంత అన్నది లెక్కగట్టింది. 1894–95నుంచి 1971–72వరకూ 78 సంవ త్సరాలపాటు ప్రకాశం బ్యారేజీవరకూ లభ్యమైన నీటిని పరిగణనలోకి తీసుకుని ఈ లెక్కతీశారు. ఈ 78 ఏళ్ల కాలంలో అత్యధికంగా 4166 టీఎంసీలు, అతితక్కువగా 1007 టీఎంసీలు వచ్చాయి. దీని ఆధారంగా 75శాతం నీటి లభ్యత అంటే 2060 టీఎంసీలని ట్రిబ్యునల్ నిర్ధారించింది. దీని ఆధారంగానే కేటాయింపులు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న జలపంపిణీ విధానాలను, భారత్ అనుసరిస్తున్న సంప్రదాయాలను ఈ ట్రిబ్యునల్ కొలబద్దగా తీసుకుంది. అదేవిధంగా స్వాతంత్ర్యానికి పూర్వం 1941లో జస్టిస్ బీఎన్‌రావు నేతృత్వంలోని ఇండస్ కమిటీ పంజాబ్ సింధు ప్రాంతాల మధ్య సింధు నదీ జలాల పంపిణీలో అప్పటికే నీటిని వినియోగిస్తున్న ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడిన విషయాన్ని కూడా బచావత్ ట్రిబ్యునల్ తన తీర్పులో అనుసరించింది. అప్పటికే వినియోగంలో ఉన్న ప్రాజెక్టులను కాపాడాలని, ఆయకట్టు హక్కును పరిరక్షించాలని 1843లో రూపారెల్ నది వివాదంలో, 1918 సట్లెజ్‌నదీ జలాల వివాదంలో ఆనాటి ప్రభుత్వాలు ప్రాధాన్యతనిచ్చాయి. అంతేకాదు దేశాలమధ్య నదీ జలాల పంపిణీకి సంబంధించి అంతర్జాతీయ చట్టాలు, అంతర్జాతీయ న్యాయసంఘం హెల్సింకీ నిబంధనలు (8వ అధికరణ) కూడా అప్పటికే ఉన్న ఆయకట్టుకు రక్షణ కల్పించాలనికూడా చెప్పాయి. ఈ సూత్రాన్ని అనుసరించే బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నీటిని కేటాయించింది. 1961నాటికి కేంద్రం అనుమతితో నిర్మించిన ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉన్నాయి. మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంలో కూడా బచావత్ ట్రిబ్యునల్ ఎంతో ముందుజాగ్రత్తతో వ్యవహరించింది. కృష్ణాబేసిన్‌లో ఆంధ్రప్రదేశ్‌ది చిట్టచివరి స్థానం. ఎగువరాష్ట్రాలు నికరజలాలను వాడేసుకుంటాయి. మిగిలితేనే ఆంధ్రప్రదేశ్‌కు నీరు వస్తుంది. కాబట్టి కొన్ని సందర్భాలలో ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నికరజలాలు అందకపోవచ్చు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొనే రాష్ట్రానికి మిగులు జలాలను

వాడుకునే స్వేచ్ఛ నిచ్చింది.

బచావత్ ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కలిగించే అంశాలు కూడా కొన్ని ఉన్నాయనికొందరు వాదిస్తున్నారు. అవి 1) ప్రొరేటా ప్రకారం నీటిని పంపిణీ చేయక పోవడం 2) గోదావరి బేసిన్‌నుంచి కృష్ణాబేసిన్‌కు మళ్లించే నీటిలో కర్ణాటక, మహారాష్ట్రకు వాటా కల్పించడం. 3) కృష్ణాబేసిన్ నీటి పంపిణీ వినియోగాన్ని సమీక్షించే బోర్డు ను నియమించకపోవడం.

బచావత్ సిఫార్సులు:

మిగులుజలాల విషయానికి సంబంధించి బచావత్ ట్రిబ్యునల్ రెండు పరిష్కారాలను పరిశీలించింది. మిగులు జలాలు ఆంధ్రప్రదేశ్‌కు కల్పించడం. దీన్ని స్కీం-ఏ గా పేర్కొంది. రెండోది మిగులుజలాలను మూడురాష్ట్రాలకు పంపిణీ చేయడం. దీన్ని స్కీం-బిగా పేర్కొంది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని తర్కవితర్కాలు చేసి చివరకు బచావత్ ట్రిబ్యునల్ స్కీం-ఏనే సిఫారసు చేసింది. ఈ మిగులుజలాల మీద ఆధారపడి రాష్ట్రప్రభుత్వం తెలుగు గంగ, శ్రీశైలంఎడమగట్టు కాలువ, కల్వకుర్తి, నెట్టెంపాడు, హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలుగొండ ప్రాజెక్టులను చేపట్టి వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. కొత్త ట్రిబ్యునల్ మిగులు జలాలను మూడు రాష్ట్రాలకూ పంచితే శ్రీశైలంలో కొచ్చే ప్రవాహం తగ్గిపోతుంది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు ఎండిపోతాయి. ఇప్పటికే కర్ణాటక అనేక అక్రమ ప్రాజెక్టులను నిర్మిస్తోంది. ఎగువతుంగ, మధ్య కృష్ణబేసిన్‌లలోనే కాక గోదావరి బేసిన్‌లైన మంజీరాపై 11 చెక్‌డ్యాముల నిర్మాణం చేపట్టి హైదరాబాదుకు నీరందించే సింగూరుకు జలలభ్యత లేకుండాచేసింది. పెన్నాబేసిన్‌లో 10 అక్రమ నిర్మాణాలు చేపట్టి సోమశిల ప్రాజెక్టుకు నీరు రాకుండా చేస్తోంది. కృష్ణాబేసిన్‌లోని జూరాల ముంపుప్రాంతానికి పరిహారం పొందికూడా వదులుకోవడంలేదు. ఫలితంగా జూరాలలో 11.6 టీఎంసీల నిల్వబదులు 6.5 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1998-2004 వరకూ కరువులు రాజ్యమేలాయి. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రులు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆల్మట్టి నుంచి 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరినా కర్ణాటక ప్రభుత్వం అంగీకరించ లేదు. నాడు ఆల్మట్టిలో నీరు నిల్వ ఉండికూడా 2009 అక్టోబరులో కృష్ణానది వరదల వల్ల రాష్ట్రం తీవ్ర నష్టానికి గురైంది.

ఆల్మట్టి వివాదం..

మధ్యకృష్ణాలో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును 524.256 మీటర్ల పెంపునకు అనుమతించాలని కర్ణాటక వాదిస్తోంది. 1996లో ఆల్మట్టి ఎత్తును పెంచాలని నిర్ణయించినప్పుడు ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు అభ్యంతరాలు చెప్పాయి. దీనిపై కేంద్రప్రభుత్వం పశ్చిమబెంగాల్, అస్సాం, బీహార్, తమిళనాడు ముఖ్యమంత్రులతో కమిటీ వేసింది. ఈ కమిటీ పశ్చిమబెంగాల్ చీఫ్ ఇంజనీర్ డీపీ గోసాల్ నాయకత్వాన ఆ రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్‌లకు బాధ్యతలు అప్పగించింది. మధ్యకృష్ణ సబ్ బేసిన్‌లో(కే-2)

కర్ణాటక 160 టీఎంసీలు వినియోగించుకోవాలని ప్లానింగ్ కమిషన్ ఆమోదం తెలిపింది. ఈ నీటిని నారాయణ్‌పూర్ ఎడమకాలువకు 103 టీఎంసీలు, కుడికాలువకు 52 టీఎంసీలు, హీప్పర్గీవైర్‌ప్రాజెక్టుకు 5టీఎంసీలు కేటాయించారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఆల్మట్టి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉంది. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా కర్ణాటక తన వాటాగా 173 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలని నిపుణుల కమిటీ తీర్పుచెప్పింది. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు 519.6 మీటర్లు పెంచుకోవచ్చని పరిష్కారం చూపింది. పై రెండు ప్రాజెక్టులలో 167.367 టీఎంసీల నిల్వ చేసుకునేందుకు కర్ణాటక నిర్మాణాలు చేపట్టింది. ఆల్మట్టి 129.721 టీఎంసీలు, నారాయణపూర్ 37.646 టీఎంసీలు నిల్వచేసుకునేందుకు సుప్రీంకోర్టు ఆమోద ముద్రవేసింది. ఇలా ఒక పరిష్కారం లభించిన అంశాన్ని కర్ణాటక తిరగతోడడం సమర్ధనీయంకాదని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వాదిస్తున్నాయి. ఈఅంశాన్ని చర్చించడమంటే సుప్రీం తీర్పును వ్యతిరేకించడ మేనని పేర్కొంటున్నాయి. ఆల్మట్టి ఎత్తును 516 మీటర్లకే పరిమితం చేయాలని మహారాష్ట్ర వాదిస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ప్రకారం– ఆల్మట్టి ద్వారా కర్ణాటక వినియోగించుకోవాల్సింది కేవలం 155 టీఎంసీలే. 173 టీఎంసీలు కాదు. అందువల్ల దాని ఎత్తు ను 516.6 మీటర్లకే పరిమితం చేయాలని ఆంధ్రప్రదేశ్ వాదిస్తోంది.

ప్రస్తుత సమస్యలు:

- ట్రిబ్యునల్ ఎదుట ముఖ్య సమస్యలున్నా.. నీటి లభ్యత, మిగులు జలాలు, ఆల్మట్టి ఎత్తు –ఈమూడే కీలకమైనవి.
- ప్రస్తుత ట్రిబ్యునల్ నీటికేటాయింపులు చేయాలన్నా, మిగులు జలాల సమస్య పరిష్కరించాలన్నా – నదిలో నీటిలభ్యత ఎంతన్నది తేల్చాలి.
- బచావత్ ట్రిబ్యునల్ అనుసరించిన ప్రమాణాలనే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా ప్రామాణికంగా తీసుకోవాలి.
- కర్ణాటక, మహారాష్ట్రలు నదిలో నీటి లభ్యత పెరిగిందని, మిగులుజలాల రూపంలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువనీరు వెళుతుందని వాదిస్తున్నాయి.
- కర్ణాటక 1948 నుంచి 50 ఏళ్ల సమాచారం ఆధారంగా నీటిలభ్యత 2612 టీఎంసీలని లెక్కచెబుతోంది.
- మహారాష్ట్ర 1894 నుండి 113 ఏళ్ల లెక్కల ఆధారంగా 2600 టీఎంసీల నీరు లభిస్తోందని అంచనావేస్తుంది.

అంటే.. బచావత్ తేల్చిన 2060 టీఎంసీల కంటే ఈ లెక్కలు 500 టీఎంసీలను ఎక్కువగా చూపుతున్నాయి.

- ఆంధ్రప్రదేశ్ 1894 నుంచి 112 ఏళ్ల సమాచారం ఆధారంగా 2402 టీఎంసీల నీటిలభ్యత ఉందని పేర్కొంది. కాబట్టి నదిలో నీటిలభ్యత ఎంతన్నదీ కొత్త ట్రిబ్యునల్ నిర్ధారించాల్సి ఉంది.